
సాక్షి ఒడిశా
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,068లు, బంగారం 12గ్రాముల 500 మిల్లీగ్రాములు వెండి 114 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సవాలకు వర్షం దెబ్బ

గజపతి ఉత్సవాలకు వర్షం అడ్డంకిగా నిలిచింది. స్టాళ్లు వెలవెలబోయాయి.

- 8లో



ఎంపీకి పరామర్శ

ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగికి తోటి ఎంపీలు పరామర్శించారు. యోగక్షేమాలు కనుక్కున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

కాలినడకన శబరిమలకు



శబరిమల చేరిన అయ్యప్ప భక్తులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌కు చెందిన జె.వెంకటరమణ, బి.శ్రీను, రాజేంద్ర నాయక్‌లు అక్టోబర్ 26వ తేదీన అయ్యప్ప దీక్ష చేపట్టి కాలి నడకన శబరిమల బయల్దేరారు. ఈ మేరకు వారంతా 54 రోజుల అనంతరం బుధవారం శబరిమల చేరుకున్నారు. ప్రతిచోట అయ్యప్ప స్వాములు ఆశ్రయం ఇవ్వడంతో పాటు భక్తులు తమను ఎంతో ఆదరించారని తెలియజేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక అన్నారు. స్థానిక దీప్తి ఉన్నత మాధ్యమిక పాఠశాలలో గురువారం నుంచి క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ గ్రేస్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. ప్రతీ ఏడాది విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకు ఇటువంటి తరహా క్రీడలను గత 21 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు విద్యార్థులు క్రీడా జ్యోతిని తీసుకురాగా దానిని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడ్రక వెలిగించి క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు.

బైక్ దొంగతనం కేసులో నిందితుని అరెస్టు



బైక్‌తో నిందితుడు సంతోష్ రాత్

జయపురం: రెండు రోజుల కిందట పట్టణంలో జరిగిన బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజనీ దొలాయి గురువారం వెల్లడించారు. నిందితుడు భూపతి వీధికి చెందిన సంతోష్ రాత్ అని వెల్లడించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి బైక్ కోసం గాలిస్తుండగా ప్రసాదరావు పేటలో బైక్ గుర్తించి పట్టుకున్నామని, బైక్‌తో ఉన్న సంతోష్ రాత్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించామని బైక్ కాగితాలు చూపించాలని అడగ్గా చూపించలేకపోయాడని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.


యువకుని మృతదేహం స్వాధీనం



డానియల్ మృతదేహం వద్ద పోలీసులు, క్లూస్ టీం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గల రెంగాయిసింగి అడవుల్లో ఒక యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు అదే గ్రామానికి చెందిన డానియల్ సాబొరొ(50)గా పోలీసులు గుర్తించారు. అయితే ఇది హత్య అని కుటుంబ సభ్యులు బుధవారం నాడు పుటాసింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్‌తో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం డానియల్ రెంగాయిసింగి గ్రామానికి సమీపంలో గల తన పంట పొలానికి పచ్చిమిర్చిని తీసుకుని వచ్చేందుకు వెళ్లాడు. అయితే సాయంత్రం అవుతున్నా ఇంకా ఇంటికి తిరిగి రాకపోవడంతో కంగారు చెందిన కుటుంబ సభ్యులు వెతికారు. ఈ క్రమంలో రెంగాయిసింగికి సమీపంలో గల ఒక కొండపై డానియల్ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

అధికారుల పెత్తనానికి చెల్లుచీటీ



- ఎంపీలు, ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక సెల్
- బుక్ సర్క్యులర్ 47 కట్టుదిట్టంగా అమలు

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రభుత్వ అధికారుల పెత్తనానికి తెరపడనుంది. ఇక నుంచి ప్రజా ప్రతినిదులు ఎమ్మెల్యేలు, ఎంపీల పట్ల ప్రభుత్వ అధికారులు వినయ విధేయతలతో స్పందించడం అనివార్యం కానుంది. ప్రజా ప్రతినిధుల సంప్రదింపుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటువుతోంది. సిఫారసు పత్రాలు ఇతరేతర సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాలు వంటి వ్యవహారాలను ఈ సెల్ నిర్వహిస్తుంది. ఈ సెల్ కార్యకలాపాలు ప్రతి నెల ఉన్నతస్థాయి సమీక్షిస్తారు. బుక్ సర్క్యులర్ 47 కట్టుదిట్టంగా అమలు ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వ అధికారులు వినయ విధేయతలు లేకుండా ప్రవర్తించడంపై రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం బుక్ సర్క్యులర్ 47 కట్టుదిట్టంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. బుక్ సర్క్యులర్ 47లోని నిబంధనలను అనుసరించి ఎంపీలు, ఎమ్మెల్యేలకు పాలనాపరమైన గౌరవంతో వినయ విధేయతల్ని ప్రదర్శించడం అనివార్యమని శాసన సభ వ్యవహారాల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి సురేంద్ర కుమార్ అన్ని శాఖల కార్యదర్శులకు లేఖ రాశారు.

ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కేంద్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఉత్తరప్రత్యుత్తరాలు, సిఫారసుల పరిశీలన తదితర కార్యకలాపాలు నిర్వహిస్తారు. తక్షణమే ఈ ప్రత్యేక సెల్‌ను తెర వాలని స్పష్టం చేశారు. విభాగాల వారీగా ఒక్కో

నోడల్ అధికారి, సమన్వయ అధికారుల ఆధ్వర్యంలో ఈ సెల్ పని చేస్తుంది. ఎంపీలు, ఎమ్మెల్యేల లేఖలు, సిఫార్సులు, ఇతర ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టడంలో ఈ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా ప్రతినిధుల సిఫారసులు ఇతరేతర అనుబంధ కార్యకలాపాల్ని క్రమం తప్పకుండా సమీక్షించి సత్వర చర్యలు చేపడతారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎంపీల లేఖలు, సిఫారసులపై తీసుకున్న చర్యలను ప్రతి నెల 10వ తేదీ సరికి పరిశీలించి కార్యాచరణ సమగ్ర నివేదికని ప్రతి నెల 15వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగానికి దాఖలు చేస్తారు. ఈ వివరాల ఆధారంగా క్రమం తప్పకుండా ప్రతి నెల 20న రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కార్యదర్శి ప్రత్యక్షంగా సమీక్షిస్తారు.

పూర్తి వివరాలు..

మండలం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎంపీలు, ఎమ్మెల్యేల చొరవపట్ల చేపట్టిన చర్యల్ని శాఖలు వారీగా పూర్తి వివరాలతో సాధారణ పాలన విభాగానికి సమగ్ర వివారల నివేదిక దాఖలు చేయడం అనివార్యం. ఈ ప్రక్రియలో బుక్ సర్క్యులర్ 47 నిబంధనల ఉల్లంఘన దృష్టికి వస్తే బాధ్యులైన వారి వ్యతిరేకంగా క్రమశిక్షణ చర్యలు చేపడతారు. ఈ కార్యాచరణతో ప్రజా ప్రతినిధులు, ప్రజల మధ్య సంబంధాలు బలపడి పారదర్శక పాలన ప్రజలకు చేరువ అవుతుందని ప్రభుత్వం యోచిస్తోంది. మరోవైపు అవాంఛనీయ శక్తుల చొరబాటు నివారించి అమాయక ప్రజలు నిరుత్సాహానికి గురి కాకుండా హామీ సాధ్యమవుతుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో మోహన్ చరణ్ మాఝీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎంపీల పట్ల ప్రభుత్వ అధికారులు వినయ విధేయతలతో మసలుకోవాలని ఈ ఏడాది ఆగస్టు 7న అన్ని శాఖలకు లేఖ రాశారు. 2005 సంవత్సరం డిసెంబరు 2న రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల శాఖ జారీ చేసిన బుక్ సర్క్యులర్ 47 మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ బుక్ సర్క్యులర్ 47 నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారులు ఎమ్మెల్యేలు, ఎంపీలకు సముచిత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏదైనా కార్యాలయానికి వెళితే సంబంధిత అధికారి లేచి నిలబడి సాదరంగా పలకరించాల్సి ఉంటుంది. అతను కాల్ చేస్తే తక్షణమే స్పందించలేని సత్వరంగా ప్రతిస్పందించడం అనివార్యం. ఈ వివరాల్ని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ప్రభుత్వ శాఖలకు గుర్తు చేశారు. దీని వలన ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధుల ఉనికి బలపడి అధికారుల అహంకార పెత్తనానికి తెర పడుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వం, ప్రజల మధ్య ప్రత్యక్ష సంబంధాలు బలపడతాయని పేర్కొన్నారు.

వీడీ వర్సిటీ విజయకేతనం



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు



ట్రోఫీ అందుకుంటున్న రన్నరప్ టీమ్

జయపురం : స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో జయపురం విశ్వవిద్యాలయ టీమ్ చాంపియన్‌గా నిలిచింది. గురువారం ఇక్కడి మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో కొరాపుట్ ప్రభుత్వ కళాశాల టీమ్, జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీమ్‌లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విక్రమదేవ్ విశ్వ విద్యాలయ టీమ్ బ్యాటింగ్ ప్రారంభించింది. నిర్ధారిత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ సాహుకారి గౌరవ్ 58 బంతుల్లో ఒక సిక్స్, 11 ఫోర్లతో 72 పరుగులు చేశాడు. ఆదిత్య శతపతి 5 సిక్స్‌లు, 3 ఫోర్లు కొట్టి 24 బాలలతో 52 పరుగులు చేసి టీమ్ విజయానికి దోహద పడ్డారు. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కొరాపుట్ ప్రభుత్వ కళాశాల 18 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 134 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫైనల్ మ్యాచ్ రిఫరీలుగా సంజయ త్రిపాఠీ, అశుతోష్ పట్నాయిక్‌లు పాల్గొన్నారు. టోర్నమెంట్ బహుమతుల ప్రధాన ఉత్సవంలో ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. గౌరవ అతిథిగా పోస్టు గ్రాడ్యుయేషన్ కౌన్సిల్ అధ్యక్షుడు ప్రశాంత కుమార్ పాత్రో పాల్గొన్నారు.

నేటి నుంచి ఇడితాల్ ఉత్సవాలు



మారథాన్ రేస్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సహోట, పక్కనే చంద్ర ధ్వజ పండ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఇడితాల్ పేరిట నిర్వహించనున్న చైతీ ఉత్సవాల్లో భాగంగా గురువారం మారథాన్ రేస్ కార్యక్రమం జరిగింది. గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జి ఐ ఇ టి) విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభమైన ఈ రేస్‌ను సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉత్సవాల ముఖ్యసలహాదారుడు జిఐఇటి డైరెక్టర్ డాక్టర్ చంద్ర ధ్వజ పండా, తహసీల్దార్ నీలావతి ఆచార్య, బీడీఓ శుభ్రాంజలి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. జీఐఈటీ నుంచి ప్రారంభమైన రేస్ ఇడితాల్ ఉత్సవ వేదిక తహసీల్దార్ కార్యాలయం వెనుక వరకు కొనసాగింది. శుక్రవారం నుంచి ఇడితాల్ ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ తెలియజేసింది. మూడు రోజుల పాటుగా జరిగే ఉత్సవాలకు రంగం సిద్ధమైంది.

ఆధునిక సాంకేతికతతో ఉపాధి అవకాశాలు



సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు



సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో 'స్కోప్స్' అంతర్జాతీయ సెమినార్‌ను ప్రారంభిస్తున్న జీఎస్ఎన్ రాజు

పర్లాకిమిడి: భవిష్యత్‌లో డిజిటల్ సిగ్నలింగ్, కృత్రిమ మేధ, వాయిస్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా విద్యార్థులు అనేక ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఆర్గనైజింగ్ చైర్మన్ ప్రొఫెసర్ దేవేంద్ర కుమార్ సాహు అన్నారు. ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్–సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్, పవర్, ఎంబెడెడ్ సిస్టంను సెంచూరియన్ వర్సిటీ (విజయనగరం) క్యాంపస్ కులపతి ప్రొఫెసర్ జి.యస్.ఎన్.రాజు, ఐఐటీ, భుభనేశ్వర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ గణపతి పండా, ఇంజనీరింగ్ స్కూల్ డీన్, ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్‌పండా, డి.కె.సాహు, రిజిస్ట్రార్(సి.యు.టి.యం) డాక్టర్ అనితా పాత్రో, సెంచూరియన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయిక్, డీఆర్‌డీఓ వ్యవస్థాపకులు, మాజీ డైరెక్టర్ డాక్టర్ పీఎస్ఆర్ శ్రీనివాస శాస్త్రి తదితరులు ప్రారంభించారు. తొలుత స్కోప్స్ కన్వీనరు ప్రొఫెసర్ అశోక్ మిశ్రా అతిథి పరిచయం చేయగా, ఐటీఆర్ చాందిపూర్ ప్రొఫెసర్ హెచ్.కె.రథ్ మాట్లాడుతూ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ, వినూత్న ఆవిష్కరణలు, సృజనాత్మక తెలివి వంటి నాలుగు డోమైన్‌లతో మనం నిత్యం వాడుతున్న ఉపకరణాలు నడుస్తాయని అన్నారు. నూతన పరికరాల గురించి వివరించారు. ఈ అంతర్జాతీయ సెమినార్ స్కోప్స్‌కు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, శ్రీలంక, భారతదేశంలో వివిధ వర్సిటీల నుంచి 656 పరిశోధనాత్మక పేపర్లు రాగా వాటిలో 239 పేపర్లు ఈ మూడు రోజుల సెమినార్‌కు ఎంపికయ్యాయని డీన్ డాక్టర్ అనితా పాత్రో తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు రెండో అంతర్జాతీయ స్కోప్స్ సెమినార్‌పై ప్రచురించిన సావనీర్‌ను ఆవిష్కరించారు.

చిరకాల వాంఛ నెరవేరింది



ప్రజా ప్రతినిధులను స్వాగతిస్తున్న గ్రామీణ ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి కెరమెటి పంచాయతీ జబాపాదర్ గ్రామంలో పీడీఎస్ గిడ్డంగిని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెడ్పీ ఉపాధ్యక్షుడు రాధాబినోద్ సామంతరాయ్ పాల్గొన్నారు. జబాపాదర్‌లో గిడ్డంగి ద్వారా రేషన్ బియ్యం సమకూర్చడం వల్ల కెరమటి పంచాయతీలో బహుళ ఆదివాసీ మారుమూల కసరగుడ, కందిజొడి, తుంబాపాదర్, గమకపాదర్, బందనపాదర్, దుడుమాగుడ తదితర గ్రామాల్లో మూడు వందలకు పైగా ప్రజలు లబ్ధి పొందుతారని తెలిపారు. ఇంత వరకు రేషన్ కార్డులపై పీడీఎస్ బియ్యం తీసుకునేందుకు కనీసం 8 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వచ్చేదని, నేటి ఆ అవస్థ ఉండదని తెలిపారు. ఆయా గ్రామ ప్రజలు కేవలం రెండు, మూడు కిలోమీటర్ల దూరం లోగల జబాపాదర్‌లో గిడ్డంగి నుంచి రేషన్ బియ్యం తీస అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కుంద్ర సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, జిల్లా పరిషత్ సభ్యులు కనకలత పెంటియ, సమితి ఉపాధ్యక్షురాలు తరుణీ సేన్ బిశాయి, జమితి సభ్యులు గోరీ హరిజన్, నాయెబ్ సర్పంచ్ మొనొ శాంత, ఆ ప్రాంతాల ప్రముఖులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. చిరకాల వాంఛ నెరవేర్చిన అధికారులకు స్థానికులు గౌరవంగా స్వాగతం పలికారు.

50 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరంలో ప్రిన్సిపాల్ శౌశానంద మిశ్ర తదితరులు



రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన నిర్వాహకులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ ప్రభుత్వ కళాశాలలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 యూనిట్ల రక్తం సేకరించారు. అమొ ఒడిశా సంబాద్ సహకారంతో కొట్‌పాడ్ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్, ఎన్‌సీసీ విభాగాలు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలలో లైబ్రేరియన్ అనూప్ బిశాయి అతడి సతీమణి రక్తదాన శిబిర నిర్వహణలో ప్రధాన భూమిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శౌశానంద మిశ్ర పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. రక్తం కొరత కారణంగా సమాజంలో ఎవరూ మరణించకూడదని అన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఆసీమా రావ్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పొగడాబలి, రెంగలపాదొరొ ఆశ్రమ పాఠశాలల్లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆసీమా రావ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పెడుతున్న ఆహార నాణ్యతపై ఆరా తీశారు. అయితే పొగడాబలి ఆశ్రమ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు వివిధ సమస్యలు ఆమె దృష్టికి రావడంతో ఆశ్రమ నిర్వాహకురాలు తరంగమయి మిశ్రాకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనంతరం రెంగలపాదొరొ ఆశ్రమ పాఠశాలలో పర్యటించి విద్యార్థులకు కాసేపు పాఠాలు చెప్పారు. ఒత్తిడికి గురవ్వకుండా చదువుకోవాలని సూచించారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



విద్యార్థులతో మధ్యాహ్నం భోజనం చేస్తున్న రావ్

ఎలుగుబంటికి తీవ్ర గాయాలు



చెట్టుపై నుంచి కిందపడిన ఎలుగు బంటి

జయపురం: ఒక చెట్టుపై నుంచి ఎలుగుబంటి కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటన కుంద్రా సమితిలో గురువారం చోటు చేసుకుంది. నాలుగు నెలల వయసున్న ఎలుగు 30 అడుగుల ఎత్తు గల చెట్టుపై నుంచి పడిపోయిందని అటవీ విభాగ అధికారి చొబంధ్ర రొందారి వెల్లడించారు. అటవీ ప్రాంతంలో గల మంకిణిగుడ గ్రామ సమీపంలో గల అడవిలో ఒక ఎలుగుబంటి చెట్టుపై నుంచి పడిందని ఎలుగుబంటి తలకు, నడుముకి బలమైన దెబ్బలు తగిలాయని, నోటి నుంచి కారుతోందని స్థానికులు సమాచారం అందిచడంతో జయపురం డీఎఫ్ఓ ప్రతాప్ కుమార్ బెహరా, ఏసీఎఫ్ అమిత్ కుమార్ నాయిక్, రేంజర్ బిశ్వనాత్ మండంగి, జయపురం వైల్డ్ లైఫ్ రెస్క్యూ టీమ్ కృష్ణ కేశరి షాడంగి, పశు చికిత్సా అధికారి డాక్టర్ చిన్మయ రౌత్, నవరంగపూర్ ఆర్.ఆర్ ఫోర్స్ వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఎలుగును రక్షించారు. దానికి ప్రాథమిక చికిత్స చేసి జయపురం పంపినట్లు అటవీశాఖ అధికారి చోబంధ్ర రొందారి వెల్లడించారు.

సమాజ సేవకుడు కార్తీక్ కన్నుమూత



కుష్టు వ్యాధి మహిళకు చికిత్స చేస్తున్న రాత్(ఫైల్)



కార్తీక్ రాత్ (ఫైల్)

జయపురం: సమాజ సేవకుడిగా కీర్తి పొందిన రాత్ కార్తీక్(47) బుధవారం కన్నుమూశారు. జయపురం స్వచ్ఛంద సంస్థ 'సహాజ్య హెల్పింగ్ హేండ్స్' వ్యవస్థాపకుల్లో ఆయన కూడా ఒకరు. కొంతకాలంగా ఆయన కేన్సర్‌తో బాధ పడుతున్నారు. జయపురంలో ఎంతో మంది నిస్సహాయలకు ఆయన సాయం చేశారు. ఎన్నోఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన మరణంతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మాజీ మంత్రి రబినారాయణ నందో, బీజేపీ నేత గౌతమ సామంతరాయ్, దేవేంద్ర బాహిణీపతి తదితరులు ఆయనకు నివాళులర్పించారు.

క్లుప్తంగా

21 నుంచి ఏయూ వారాంతపు తరగతులు

శ్రీకాకుళం: ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీకాం 1, 2 సెమిస్టర్లకు ఈ నెల 21 నుంచి వారాంతపు తరగతులు నిర్వహించనున్నట్లు ఏయూ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాలురు)లో జరిగే ఈ తరగతులకు విద్యార్థులు గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ



డివైడర్‌పై ఆగిన లారీ

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట జాతీయ రహదారిపై గురువారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. కుర్దా నుంచి విశాఖపట్నం వైపుకు ఫ్లై వుడ్ సామగ్రితో వెళ్తున్న లారీ అదుపు తప్పి గుండవల్లిపేట వద్ద డివైడర్ పైకి ఎక్కింది. వెంటనే డ్రైవర్ అప్రమత్తం కావడంతో డివైడర్‌పై ఆగిపోయింది. అదే వేగంతో సర్వీసు రోడ్డుపైకి వెళ్తే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. రోడ్డుపై ఆ సమయంలో అనేక మంది ఉన్నారని, అలాగే సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఇళ్లు ఉన్నాయని చెప్పారు. విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి డివైడర్ మీదే లారీ ఉండిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు కూడా ఎటువంటి గాయాలు కాలేదు. బుధవారం కోటబొమ్మాళి మండలం పాకివలస, ఇటీవల రణస్థలం వద్ద జరిగిన ప్రమాదాల్లో కార్లు అదుపు తప్పి డివైడర్ దాటి రోడ్డుపైకి దూసుకెళ్లడంతో ఐదుగురు మరణించిన సంగతి తెలిసిందే.

బైకును ఢీకొట్టిన కారు

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం, కారు

నరసన్నపేట: మండలంలో జమ్ము దాటిన తర్వాత జాతీయ రహదారి(326ఏ)పై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం ఊడికలపాడుకు చెందిన తండ్రీకొడుకులు వావిలపల్లి సింహాచలం, తవిటయ్యలకు గాయాలయ్యాయి. ఇంటి నుంచి నారాయణవలస సంతకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చల్లపేట వైపు నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సింహాచలంకు ఎడమ చేయి విరగడంతో పాటు తవిటియ్యకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జు కాగా, కారు ముందు భాగం ధ్వంసమైంది. సింహాచలం ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టూరిస్ట్ బస్సు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన బస్సు

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి కూడలి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో టూరిస్టు బస్సు బోల్తాపడింది. ఒడిశా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన యాత్రికులు రాజస్థాన్‌కు తీర్థయాత్రకు వెళ్లి తిరిగి స్వస్థలాలకు బయలుదేరారు. మాకన్నపల్లి కూడలికి వచ్చేసరికి లారీని ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో బరంపురం పట్టణానికి చెందిన రాజేంద్ర బెహరా, కురు బెహరాకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వేకువజామున ఘటన జరగడంతో భయాందోళనకు గురైన స్థానికులు తేరుకుని 108కు సమాచారం అందించారు. వెంటనే పలాస 108 ఈఎంటీ మోహనరావు, పైలెట్ వెంకటరావులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన వారిని తరలిస్తున్న 108 సిబ్బంది

గజపతి ఉత్సవాలకు రెండో రోజు వర్షం దెబ్బ



గోటిపువా నృత్యం

పర్లాకిమిడి: అల్పపీడనం వల్ల గజపతి ఉత్సవాలు జరుగుతున్న స్టేడియంలో జనాలు కరువయ్యారు. రెండో రోజు గజపతి ఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఎస్పీ జితేంద్రకుమార్ పండా, ఏడీఎం రాజేంద్ర మింజ్, రాయగడ సమితి చైర్మన్ పూర్ణబాసి నాయక్, కాశీనగర్ సమితి చైర్మన్ బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు తదితరులు విచ్చేశారు. వర్షం కారణంగా అతిథుల ప్రసంగాలకు స్వస్తి చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత భరత్ పండా, అనాథాశ్రమం సోషల్ వర్కరు నిహార్ రంజన్ పండాను ముఖ్య అతిథులు రూపేష్ పాణిగ్రాహి, దాశరథి గోమాంగో లు దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం చంద్రగిరి టిబెటియన్ శరణార్థుల నృత్యం, స్థానిక కళాకారుల నృత్యాలు ప్రదర్శించారు. కలెక్టర్ దాస్ అధ్యక్షత వహించారు.



అస్సామీ నృత్యం



పశ్చిమబెంగాల్ నృత్యం



వందేమాతరం గీతానికి నృత్యం



అస్సామీ నృత్యం

మంత్రి నిత్యానంద గొండోపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేడీ నాయకులు

కొరాపుట్: రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నిత్యానంద గొండోను మంత్రి పదవి నుంచి తొలగించాలని బీజేడీ పార్టీ డిమాండ్ చేసింది. గురువారం నబరంగ్పూర్ జిల్లా కేంద్రం లోని గ్లేజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి మాట్లాడారు.

మంత్రికి చెందిన శాఖ కార్యదర్శి విష్ణు చరణ్ పరిడాపై సీబీఐ నోటీసులు జారీ చేసిందన్నారు. సుమారు రు.387 కోట్ల నిధులు స్కూల్ భవనాల నిర్మాణం కోసం ఏకపక్షంగా విద్య, సాంఘీక సంక్షేమశాఖల విభాగానికి కేటాయించారన్నారు. రూ.20 కోట్లకు పైబడి నిర్మాణం పనులను ఏకపక్షంగా కేటాయిస్తే క్యాబినెట్ ఆమోదం ఉండాలన్నారు. వందల కోట్ల పనులకు టెండర్లు లేకుండా కేటాయించినప్పుడు మంత్రికి తెలియకుండా జరగదన్నారు. ఈ కుంభకోణంలో సీబీఐ కేవలం సంబంధిత శాఖ కార్యదర్శికి మాత్రమే విచారణకు హాజరు కావాలని నోటీసు జారీ చేసిందన్నారు. ఇంత పెద్ద అవినీతి మంత్రికి తెలియకుండా చాంబర్ నుంచి లావాదేవీలు జరగవన్నారు. మంత్రిని కూడా సీబీఐ విచారణ చేయాలన్నారు. మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని, ముఖ్యమంత్రి కల్పించుకుని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాని రమేష్ మజ్జి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, బీజేడీ నాయకులు మంజులా మజ్జి, రబి పట్నాయక్, తపస్ త్రిపాఠి, సరోజ్ పాత్రో, ప్రమోద్ రథో, దిల్లు పండా, తదితరులు ప్రసంగించారు.

‘గుడ్ గవర్నెన్స్ వీక్’ ప్రారంభం



గుడ్ గవర్నెన్స్ వీక్, కర్మశాల ప్రారంభంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: కలెక్టరేట్‌లోని ఓస్వాన్ హాల్‌లో జిల్లా స్థాయి ‘గుడ్ గవర్నెన్స్ వీక్, కర్మశాలను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏడీఎం రాజేంద్రమింజ్ అధ్యక్షత వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గజపతి జిల్లాలో విద్య, ఆరోగ్యం, రవాణా, సాధారణ ప్రజల వివిధ వినతులు, సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకూ గుడ్ గవర్నెనెన్స్ పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. గుడ్ గవర్నెనెన్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో ఈ నెల 19 నుంచి 25 వరకూ జిల్లా, బ్లాక్ స్థాయి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు లిపినా దాస్, కమలకాంత పండా, సి.డి.ఎం.ఓ డాక్టర్ ఎం.ముబారక్ అలీ, రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ శ్రీకాంత్ సామల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు

రాయగడ: స్థానిక పాత రెవెన్యూ కాలనీ సమీపంలో గల అంబేడ్కర్‌నగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ప్రారంభించారు. క్రైస్తవులు సాయంత్రం మేరీ మాతా విగ్రహాన్ని పట్టుకుని ఊరిగింపు చేపట్టారు. పిల్లలు సాంతా క్లాజ్ వేషధారణలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ నెల 25 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని క్రైస్తవులు తెలిపారు.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్‌టీసీ బస్సు
- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



బస్సు ఢీకొట్టడంతో బోల్తాపడిన ట్రాక్టర్ తొట్టి

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు జంక్షన్ సమీపంలో అలికాం–బత్తిలి రోడ్డుపై గురువారం ఇసుక ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. కొత్తూరు నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ (5 స్టాప్) బస్సు ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ ఉన్న వైపున రోడ్డు పక్కన భారీ చెట్టు కొమ్మ ఉంది. ఆ కొమ్మను తప్పించే క్రమంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో ట్రాక్టర్ తొట్టె బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గానీ, బస్సులో డ్రైవర్, ప్రయాణికులకు గానీ ఎటువంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

రాజధానిని తాకిన ఢిల్లీ సెగలు



మాస్టరు క్యాంటీన్ కూడలిలో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధంతో నిరసన ప్రదర్శించిన బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు

భువనేశ్వర్: పార్లమెంటు ఆవరణలో జారిపడి బాలాసోర్ నియోజక వర్గం పార్లమెంటు సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి ప్రతాప్ చంద్ర షడంగి గాయపడడం వెనక రాహుల్ గాంధీ హస్తం ఉందని, ఆయన తోసేయడంతో ప్రతాప్ చంద్ర షడంగి గాయపడ్డారనే దుమారంతో న్యూ ఢిల్లీలో చెలరేగిన ఆందోళన సెగలు రాష్ట్రానికి విస్తరించాయి. ఈ చర్యకు ఎదురు తిరిగి రాష్ట్ర యువజన కాంగ్రెసు కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తూ గురువారం వీధికి ఎక్కింది. మొత్తం మీద ఢిల్లీలో జరిగిన సంఘటనతో రాష్ట్ర రాజకీయ వాతావరణం బాగా వేడెక్కింది. రాహుల్ గాంధీ సీనియర్ నాయకుడిని నెట్టేసి గాయపరిచిన తీరుపై భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర శాఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ చర్యకు నిరసనగా స్థానిక మాస్టరు క్యాంటీన్ ఛక్ ప్రాంతంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ కాల్చి నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన సభ వరకు బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు రాహుల్ గాంధీ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. రాహుల్ గాంధీ భారత జాతికి క్షమాపణ చెప్పాలని ఈ వర్గం డిమాండు చేసింది.

రాష్ట్ర విద్యార్థి, యువజన కాంగ్రెసు అధినేత సయ్యద్ యాషిర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. భారత రాజ్యాంగం ఆవిష్కర్త బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత జాతికి క్షమాపణ చెప్పాలని ఆందోళనకారులు చేసిన గోలతో పరిసరాలు మారు మోగాయి. అంబేడ్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యల పట్ల వ్యతిరేక పవనాల్ని అడ్డుకునేందుకు పార్లమెంటు ఆవరణలో ఎంపీ జారిపడి గాయపడిన సంఘటనకు రంగు పులిమి ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ విఫల యత్నం చేస్తోందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జయదేవ్ జెనా ఆరోపించారు. యావత్ భారతీయులకు అమిత్ షా భేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందేనని ఆందోళనని మరింత వేడెక్కించారు.



కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా డిమాండుతో కాంగ్రెసు నాయకుల ధర్నా

కూర్మనాథుని సన్నిధిలో మెరైన్ ఎస్పీ రవివర్మ

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని తీర ప్రాంత రక్షణ దళం (మెరైన్) ఎస్పీ రవివర్మ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని వివరించగా.. ఈవో జి.గురునాథరావు స్వామి చిత్రపటాన్ని, క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు కళింగపట్నం మెరైన్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద పర్యవేక్షించాలని సూచించారు. ఆయనతో పాటు కళింగపట్నం మెరైన్ స్టేషన్ సీఐ బూర ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ఎంవీపీకాలనీ: గాయత్రీ విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ చదువుతున్న సామినేని శిరీష(22) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన శిరీష ఎంటెక్ అభ్యసించేందుకు నగరానికి వచ్చింది. ఎంవీపీ కాలనీలో తన అక్కాబావల వద్ద ఉంటూ చదువుకుంటోంది. అదే గ్రామానికి చెందిన దిలీప్‌తో ఆమెకు వివాహం జరగడంతో, వారం వారం పొందూరు వెళ్లి వస్తోంది. కాగా చదువు మధ్యలోనే పెళ్లి చేయడం, ఇటీవల తండ్రి మరణించడంతో ఆమె మనస్తాపానికి గురైంది. అలాగే వ్యవసాయ నేపథ్యం ఉన్న దిలీప్‌తో పెళ్లి చేయడం కూడా శిరీషకు ఇష్టం లేనట్లు తెలిసింది. బుధవారం ఆమె అక్కాబావ వివాహ కార్యక్రమం కోసం వేరే ఊరు వెళ్లారు. దీంతో శిరీష ఒక్కతే ఇంట్లో ఉంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చాలాసార్లు ఆమె ఫోన్‌కు కాల్ చేసినా శిరీష స్పందించకపోవడంతో కంగారుపడి, తెలిసిన వారికి సమాచారం ఇచ్చారు. వారు ఇంటి కిటికీ నుంచి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులు ఆమె మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె రాత్రి ఎవరితో మాట్లాడింది? ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే విషయాలు దర్యాప్తులో తేలుతాయని పోలీసులు తెలిపారు.

ప్రతాప్ చంద్ర షడంగికి రాష్ట్ర ఎంపీల పరామర్శ



ఎంపీల తోపులాటలో గాయపడిన బాలాసోర్ నియోజక వర్గం సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగి



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరామర్శ

భువనేశ్వర్: భారత పార్లమెంట్ ఆవరణలో తోపులాటలో రాష్ట్రానికి చెందిన బాలాసోర్ నియోజక వర్గం సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగి గాయపడ్డారు. ఆయనకు న్యూ ఢిల్లీ రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంపీలు, కేంద్ర మంత్రులు పరామర్శించారు. వీరిలో భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ వంటి ప్రముఖులు ఉన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ నాయకులు ఈ సంఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ పరామర్శ



భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి పరామర్శ

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

- గున్నమ్మను పరామర్శించిన తిలక్

టెక్కలి: మండలంలోని చాకిపల్లిలో తెలుగుదేశం పార్టీ వర్గీయుల చేతిలో గాయపడి టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చుక్క గున్నమ్మ, ఆమె కుమార్తెను వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ గురువారం పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు మితిమీరుతున్నాయని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు ప్రాధాన్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తిలక్‌తో పాటు నాయకులు జి.మోహనరెడ్డి, పి.రమణబాబు, బి.రాజేష్, కే.జీవన్ తదితరులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న పేరాడ తిలక్

విద్యుత్‌శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

అరసవల్లి: ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్ శాఖను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిద్దామని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎం వి.గోపాలరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సంస్కరణల ముసుగులో ప్రభుత్వ ఆధీనంలో విద్యుత్ శాఖను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం తగదన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఆందోళనకు దిగిన విద్యుత్ కార్మికులపై ఎస్మా విధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆ రెండు రాష్ట్రాల కార్మికులకు సంఘీభావంగా మన రాష్ట్రంలో కూడా విద్యుత్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ఆందోళన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్‌ను డీబీటీ విధానంలో ఇస్తా మని చెబుతూ ప్రైవేటీకరణకు దారులు తెరుస్తున్నారని..ఈ విధానంపై తామంతా నిరసనలు ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ జి.రమేష్ కుమార్, సభ్యులు జె.సురేష్‌కుమార్, గురునాథరావు, లోకేశ్వరరావు, సూర్యనారాయణ, రాజారావు, టి.వి.సుబ్రహమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న జిల్లా విద్యుత్ జేఏసీ ప్రతినిధులు

క్లుప్తంగా

భామిని సమీపంలోకి ఏనుగుల గుంపు



భామిని నదీతీరంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు

భామిని: మండల కేంద్రంలోకి గురువారం కొత్త సమస్య వచ్చి పడింది. భామిని నదీతీరంలోకి నాలుగు ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఇంతవరకు పసుకుడి తీరంలో ఉన్న ఏనుగుల గుంపు భామిని వైపు నడిచింది. తీరం వెంబడి ఏనుగుల గుంపు నడిచిందని పంటలు వేసిన రైతులు తెలిపారు.మండల కేంద్రంలోకి ఏనుగుల గుంపు చేరి పంటలను నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పదోతరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ విడుదల



పదోతరగతి పరీక్షకు మోడల్ టెస్ట్ పేపర్స్‌ను విడుదల చేసిన డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల ప్రిపరేషన్ కోసం ఉపాధ్యాయులు రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను డీఈఓ యు.మాణిక్యం నాయుడు తన చాంబర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అధికమార్కుల సాధన కోసం ఉపాధ్యాయులు శ్రద్ధ చూపి స్వయంగా రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వా టిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మోడల్ టెస్ట్ పేపర్ల సెట్‌లో ఏడు సబ్జెక్టుల నుంచి తయారు చేసినవని పేపర్ల రూపకర్తలు వివరించారు. ప్రతి సబ్జెక్టుకు నాలుగు మోడల్ పేపర్లు జవాబులతో కూడి ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కేవీరమణ, అడిషనల్ డైరెక్టర్ బేత గౌరీశంకర్, సూపరింటిండెంట్ బాల భాస్కర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, జేవీ ఆర్ కే ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సీహెచ్‌తిరుపతి నాయుడు, ఎ.శంకరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వాసుదేవరావు, జి.రమణ, వీ.శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు



తంగుడుబిల్లిలో రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

నెల్లిమర్ల రూరల్: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని తంగుడుబిల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు 1600 టార్పాలిన్లను కొనుగోలు చేశామన్నారు. నెల్లిమర్ల మండలానికి 32 పరదాలు పంపిణీ చేశామని చెప్పారు. నూర్పు చేసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే సమీప ఆర్‌ఎస్‌కేల్లో తిరిగి అప్పగించాలని సూచించారు. వర్షాలు పడుతుండంతో కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాయే లక్ష్యం

విజయనగరం ఫోర్ట్: క్షయ రహిత జిల్లాయే లక్ష్యంగా వంద రోజుల క్షయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 10 వాహ నాల ద్వారా క్షయ పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 779 క్షయ వ్యాధి నిర్ధారణ, వైద్యపరీక్షల శిబిరాలు నిర్వహించినట్టు వెల్లడించారు. క్షయవ్యాధి ప్రచార, నిర్మూలనా కార్యక్రమంపై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి పుణ్య సలీలా శ్రీవాత్సవ, అడిషనల్ సెక్రటరీ అరాధనా పట్నాయక్, టీబీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఊర్వశి బిసింగ్, టీబీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్‌రావ్‌లు గురువారం జాతీ య స్థాయి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో చేపట్టిన క్షయ నివారణ చర్యలను వివరించారు. క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నా మని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి పాల్గొన్నారు.

పాపం పశువులు..!



పార్వతీపురం సంతలో పశువులు

- జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు తరలింపు
- పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా వ్యవహారం
- జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు కూడా..
- జిల్లాలో నాలుగు పశువుల పికప్ పాయింట్లు
- నిబంధనలు తుంగలో తొక్కుతున్న వ్యాపారస్తులు
- పట్టించుకోని పశుసంవర్ధక శాఖాధికారులు
- ప్రతి వారం 4వేలనుంచి 5వేల వరకు పశువుల అక్రమ రవాణా

పార్వతీపురం టౌన్: జిల్లాలో యథేచ్ఛగా కబేళాకు గోవుల తరలింపు జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా ఈ వ్యవహారం నడుస్తున్న ప్పటికీ పైస్థాయి అధికారులు ఈ విషయం పట్టించుకోపోవడంతో కిందిస్థాయిలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులతో కుమ్మక్కై వ్యాపారులు దీన్ని ఆదాయమార్గంగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో చూస్తున్న వారంతా పాపం పశువులు అంటూ విచారం వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రతి గురువారం పశువుల సంత జరుగుతుంది. పట్టణ శివారున ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఈ సంత దశాబ్దాల నుంచి జరుగుతోంది. ఈ సంతలో ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నపోతులు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు చేస్తుంటారు. సర్వసాధారణంగా పశువుల సంత అనగానే..రైతులు గుర్తుకొస్తారు. తమ అవసరాలకు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న మూగ జీవాలను విక్రయిస్తుంటారు. జీవన భృతి కోసం..సాగు కోసం..మరి కొందరు రైతులు ఆదే మూగ జీవాలను కొనుగోలు చేస్తుంటారు. ఇలా వేలాదిమంది రైతులు..ప్రతి గురువారం నిర్వహించే పార్వతీపురం సంతకు విచ్చేస్తుంటారు. ఇదే అదునుగా కొందరు పశువుల వ్యాపారులు ప్రతివారం సుమారు 4వేలనుంచి 5వేల వరకు పశువులను అక్రమంగా రవాణా, కొనుగోలు చేస్తూ, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రతివారం లక్షల్లో వ్యాపారం చేస్తూ..వేలాది పశువులు కబేళాకు తరలిస్తున్నారు.

పశువుల సంతల్లోనే..

జిల్లాకేంద్రం కేంద్రంగా పశువుల సంత నడుస్తోంది ఇక్కడ గేదెలు, ఆవులు, దున్నపోతుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఒడిశా సరిహద్దు గ్రామాలు, కొమరాడ, జియమ్మవలస, కురుపాం, గరుగుబిల్లి, బొబ్బిలి, సాలూరు నుంచి ఈ సంతకు పశువులను అమ్మకాలకు తీసుకొస్తుంటారు. ఇక్కడ గతంలో గురువారం ఒక రోజే సంత నిర్వహించేవారు. సంతలో పశువుల అమ్మకాలు జరపాలంటే ముందుగా పశువైద్యాధికారులు పరిశీలించాలి. ఈ సంత నిర్వహణకు ఏఎంసీ అనుమతి తప్పనిసరి. నిబంధనలకు విరుద్ధంగా మూగ జీవాలను అక్రమంగా తరలిస్తున్నారు.

నిబంధనలు గాలికి

మూగజీవాల అక్రమ తరలింపును అడ్డుకోడానికి కేంద్రప్రభుత్వం జంతు సంరక్షణ చట్టం-1960, గో సంరక్షణ చట్టం-1977లను రూపొందించింది. ఈ చట్టాలను అనుసరించి, పశువులను తరలించే వాహనాలు రవాణాశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. గొర్రెలను, మేకలను 0.3 స్క్వేర్ మీటర్లలో, పెద్ద జంతువులను 2 స్క్వేర్ మీటర్ల స్థలం ఉండే వాహనాల్లోనే తరలించాలి. ఆరోగ్యం బాగోలేని పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించకూడదు. తరలింపులో పశువుల వయస్సు, వాటి బరువును కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పెద్ద జంతువుల పక్కన చిన్న జంతువులను పెట్టరాదు. పశువుల తరలింపులో స్థానిక పశు వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. వాహనాల్లో పశువులకు సరిపడా ఆహారం, నీడ, నీరు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రవాణాలో గాయపడే పశువులకు ప్రాథమిక వైద్యమందించే అనుభవమున్న వ్యక్తి కూడా ఆయా వాహనాల్లో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలేవీ పార్వతీపురం కేంద్రం నుంచి పశువులను తరలించే వాహనాల్లో వ్యాపారులు పాటించడం లేదని జంతు ప్రేమికులు మండిపడుతున్నారు.

పశువులకు గాయాలు..

పెద్ద కొమ్ముల కలిగిన గేదెల వల్ల పక్కనున్న గేదెలు తీవ్ర గాయలపాలవుతుంటాయి. ఒకదాని పక్కన ఇంకోటి పెట్టడం వల్ల తొక్కిసలాటలో చిన్న జంతువుల కాళ్లు విరిగిపోవడం, శరీరం గాయలపాలవడం జరుగుతోంది. గాయాలైన పశువులకు ప్రాథమిక వైద్యం సైతం అందించే పరిస్థితి లేదు. ఇక్కడి సంతలో కొనుగోలు చేసిన పశువులను విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, తమిళనాడు, కేరళకు తరలిస్తుంటారు. ఇలా వందల కిలో మీటర్ల మేర పశువులను ఎటువంటి సౌకర్యాలూ లేకుండా తీసుకెళ్లుంటారు. మేతగాని, నీరుగాని లేకుండా మూడు నాలుగు రోజుల పాటు పశువులు ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. ఏ భంగిమలో ఉంటే అదే భంగిమలో పశువులను నాలుగు రోజుల అలాగే ఉంచి తీసుకువెళ్తారు.

చట్టాల్లో లొసుగులే వ్యాపారులకు కాసులు

పశువుల అక్రమ రవాణాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు రూపొందిస్తూనే ఉన్నాయి. ఎన్ని చట్టాలున్నా పశువుల అక్రమ రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఇందుకు అందేలో ఉన్న లొసుగులే కారణం. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షించడానికి ప్రతి జిల్లాలో గోశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగిలిన జిల్లాల సంగతేమోగాని, జిల్లాలో ఎక్కడా గోశాల లేదు. దీనివల్ల సీజ్ చేసిన వాహనాల్లోని పశువుల సంరక్షణ భారంగా మారుతోంది. దీంతో పట్టుబడిన వాహనాలపై జరిమానా విధించి, పోలీసులు విడిచిపెడుతున్నట్లు సమాచారం. ఇదే వ్యాపారులకు వరంగా మారింది. ఫైన్ కడితే సరి..పశువుల అక్రమ రవాణాకు అడ్డేలేకుండా పోతోంది.

కలెక్టర్, ఎస్పీ స్పందించాలి



జిల్లాల్లో పశువుల సంతల నిర్వహణపై కలెక్టర్, ఎస్పీ స్పందించాలి. అప్పుడు కొన్ని నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అడ్డాపుశీల, మరిపవలస, కోట్టకి ప్రాంతాల్లో వాటిని స్టాక్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. మాగజీవాలని చూడకుండా ఒక్కో వాహనంలో 10 వరకు కుక్కి రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

-బోటు రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ సభ్యుడు. పార్వతీపురం



బొలెరో వాహనంలో పశువులను బలవతంగా ఎక్కిస్తున్న వ్యావారులు

వాహనాల్లో కుక్కిఎక్కించి..

పశువుల తరలింపులో ఆయా జంతువుల ఆకారాలను బట్టి వాహనాలను వినియోగించాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా జిల్లా నుంచి పశువులను తరలించే వ్యాపారులు అనుసరిస్తున్నారు. ఒకే దాహనంలో పదుల సంఖ్యలో పశువులను కుక్కి ఎక్కిస్తున్నారు. ఒక పెద్ద వాహనంలో ఎనిమిది పశువులు పట్టాల్సిన చోట 30 నుంచి 45 పశువులను ఎక్కిస్తున్నారు. రెండు మూడు పశువులు పట్టే టాటా ఏస్, బొలెరో వాహనంలో 8 నుంచి 10 వరకూ ఎక్కిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా చూడకుండా అన్ని పశువులను ఒకే వాహనంలో తరలిస్తున్నారు.

ఆరు నెలలుగా ఎవరికీ సర్టిఫికెట్ ఇవ్వలేదు..

గత ఆరు నెలలుగా ఇంతవరకూ ఎవరికీ పశువుల రవాణాకు సంబంధించి ఎటువంటి ధ్రువీకరణ పత్రమూ ఇవ్వలేదు. పశువుల రవాణాలో ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. వాటిలో పశువుల ఆరోగ్యంపై పశువైద్యుడిగా నేనివ్వాల్సిన ధ్రువీకరణ ఒకటి. ఈ పత్రం లేకుండా పశువులు తరలించడం చట్టరీత్యా నేరం. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ శివ్వాల మన్మథరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి, పార్వతీపురం మన్యం

చేపల ఉత్పత్తిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మత్స్యకారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో చేపల పెంపకందారులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి పలు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేపల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై శిక్షణ తరగతుల కార్యక్రమంలో కలెక్టర్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చేపల సంపద అభివృద్ధి జరగాలని, మత్స్య సంపద ద్వారా సంవత్సరానికి కేవలం రూ.194 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరుతోందన్నారు. చేపల పెంపకంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 96 వేల మంది ఆధారపడుతున్నారని, చేపల పెంపకంపై మత్స్యకారుల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాలని జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్యకు సూచించారు. జిల్లాలో ఉన్న పంచాయతీల్లో సుమారు 1800 చెరువులు ఉన్నాయని వాటిని చేపల పెంపకందారులు సద్వినియోగం చేసుకుని, చేపల పెంపకం పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త, ఫిషరీస్ స్టేట్ కో ఆర్డినేటర్ కె.గంగాధర్, డీఆర్‌డీఏ ఏపీఎం కె.భారతి, స్వచ్ఛ సుందర పార్వతీపురం ట్రస్ట్ సభ్యులు పద్మజ, పునర్వి ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ సీఈఓ హేమంత్, ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘ వైస్‌చైర్మన్ దాసరి లక్ష్మణ్, ఎఫ్‌డీఓలు, మత్స్యకార సంఘం డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ

- ఎస్పీ వకుల్ జిందాల్

సంతకవిటి: స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ముందుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ వకుల్ జిందాల్‌కు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్ఐలు బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఎస్పీ వకుల్ జిందాల్ సంతకవిటి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులు, పోలీస్ సిబ్బందితో సమేకమై వారికి దత్తతగా అప్పగించిన గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు భూ తగాదాలు, గొడవలు వివిధ రాజకీయ పార్టీల వైరాలు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల పేర్లు గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందజేయాలని సూచించారు. ప్రతి వారం విధిగా దత్తత గ్రామాలను పోలీసులు సందర్శించాలని, ప్రజలకు సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేవించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.



మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సంకల్పంపై అవగాహన కల్పించాలి

గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలు, విద్యార్థులకు 'సంకల్పం' కార్యక్రమంతో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానిక వ్యాపారులు, ప్రజలు, ఎంఎస్‌పీల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూమ్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయిపై ఎక్కువ ఫోకస్ చేశామని గడిచిన 5 నెలల్లో 200 మందిని జిల్లాలో అరెస్ట్ చేశామని తెలిపారు. గంజాయి పట్టుబడితే అది ఎక్కడ పండింది? ఎక్కడి నుంచి రవాణా జరుగుతోంది? ఎవరు అమ్మారు, ఎవరు కొన్నారు అనే విషయాలపై ఎక్కువ దృష్టి సారించామన్నారు. కొత్తగా 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి రోజు 10 చోట్ల జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు.



ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పారిశుద్ధ్య కార్మికులకు ష్యూరిటీలేని రుణాలు

విజయనగరం అర్బన్: సఫాయి కర్మచారి (పారిశుద్ధ్య కార్మికులు)లకు ష్యూరిటీ లేని రుణాలు మంజూరు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేవంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారిలకు విధిగా పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అందుతున్న పథకాలు, సామాజిక, విద్యా, ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. కార్మికులు చనిపోయిన వెంటనే కారుణ్య నియామకాల కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్మికులకు అవసరమైన దుస్తులు, బూట్లు, చేతి గ్లౌవ్స్, నూనె తదితర సామగ్రిని అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆదాయాలకు అతీతంగా కార్మికులకు ప్రభుత్వం ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అదనపు ఎస్పీ సౌమ్యలత, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామానందం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డీఈఓ యూ.మాణిక్యంనాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, విజయనగరం, రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, అప్పలనాయుడు, రామలక్ష్మి, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతులు



మెయిన్‌రోడ్డులో తీసిన గుంతలు పూడుస్తూ చేస్తున్న మరమ్మతులు

సాలూరు: మున్సిపాలిటీలో రోడ్ల మరమ్మత్తుతు చేపడుతున్నామని తెలిపి రోడ్లు తవ్వేసి వదిలేయడంపై 'తవ్వేసి వదిలేశారు' శీర్షికన ఈ నెల 17న సాక్షిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు తవ్వేసిన రోడ్లను కప్పుతూ మరమ్మతులు చేపట్టారు. అయితే ఓ వైపు మరమ్మతులు చేపడుతుండగా మరోవైపు చినుకులు పడుతున్న నేపథ్యంలో ఈ మరమ్మతుల రోడ్లు ఎంతవరకు నిలుస్తాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గంజాయి తరలింపుపై గట్టి నిఘా



గంజాయి, నిందితులను చూపిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు, సిబ్బంది

బొబ్బిలి: డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ తరలింపుపై గట్టి నిఘా పెట్టామని డీఎస్పీ పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి తరలింపు ముఠాను పట్టుకోవడంలో మండలాల ఎస్సైలు, సిబ్బంది చాకచక్యాన్ని కొనియాడారు. ఒడిశాలోని పొట్టంగికి చెందిన ఓ మైనర్‌ను, కొరాపుట్‌లోని పాండేల్‌కు చెందిన చందన్ అద్కాటియా, హర్యానాలోని గోధికి చెందిన వీరేంద్ర సింగ్, రాజ్‌పుత్‌కు చెందిన సునీల్ రాణాలను గంజాయి అక్రమ రవాణా కేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.91వేల విలువైన 18.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసును నమోదుచేయడానికి, నిందితులను పట్టుకోవడంలో బాడంగి, రామభద్రపురం ఎస్సైలు తారకేశ్వర రావు, వెలమల ప్రసాదరావు, రామభద్రపురం స్టేషన్‌కు చెందిన ఇద్దరు పీసీల కృషి ఉందని అభినందించారు. రూరల్ సీఐ నారాయణరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కిర్రాక్ ఫీచర్లతో వీవో ఎక్స్200 సిరీస్ విడుదల



వీవో ఎక్స్ 200 సిరీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

దాబాగార్డెన్స్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెల్ పాయింట్ ఇండియా వీవో ఎక్స్200 సిరీస్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా ఈ మొబైల్ ఫోన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏ కంపెనీ కొత్త మొబైల్ ఫోన్లను విడుదల చేసినా అవి ముందుగా సెల్‌పాయింట్‌లోనే అందుబాటులోకి వస్తాయన్నారు. నగరంలో సెల్‌పాయింట్ సెల్‌ఫోన్లకు అడ్డాగా మారిందని, వీవో ఎక్స్ 200 సిరీస్ మంచి ఫీచర్లతో మార్కెట్లోకి విడుదలైందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సిరీస్‌ను రూపొందించారన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సెల్‌పాయింట్ అధినేతను ఆయన అభినందించారు. చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 స్టోర్లకు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. వీవో ఎక్స్200 సిరీస్‌లో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని, ముఖ్యంగా కెమెరా, బ్యాటరీ, డిస్‌ప్లే వంటి వాటిపై కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. వీవో ఎక్స్ 200 సిరీస్ కొనుగోలుపై ఉచితంగా హ్యాపీ పోలా 100 వాట్స్ సౌండ్‌బార్, వీవో బడ్స్ టీడబ్ల్యూఎస్ 3ఈ ఏఎన్‌సీ అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని ఉత్పత్తులపై రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, శాంసంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోనీ, హైయర్, ఏసర్ వంటి టాప్ బ్రాండ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్, యాక్సెరీస్‌పై 60 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు వివరించారు. సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, వీవో సంస్థ ప్రతినిధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో నూతన నియామకాలు

విజయనగరం: సంస్థాగతంగా పార్టీ బలోపేతంలో భాగంగా వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పరంగా నూతన నియమాకాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో పలు నియోజకవర్గాలకు సంబంధించి నాయకులకు నూతనంగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.మురళీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ అన్వర్ బాషాను నియమించారు. చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పబ్లిసిటీ వింగ్ ప్రెసిడెంట్‌గా వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బూత్ కమిటీల అధ్యక్షుడిగా బూర్లె నరేష్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి ,రైతు విభాగం అధ్యక్షుడిగా మంత్రి అప్పలనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పీరుబండి జైహింద్ కుమార్, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా వేమలి ముత్యాల నాయుడును నియమించారు. రాజాం నియోజకవర్గానికి సంబంధించి వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టర్ బలివాడ నరేంద్రకుమార్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎలకల వాసునాయుడు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా గంధవరపు హేమంత్‌కుమార్‌లను నియమించారు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి మహిళా విభాగం అధ్యక్షురాలిగా గదల సత్యలత, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కేదారిశెట్టి సీతారామ్మూర్తి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎ.నాగవెంకట అంజనీకుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా దవడ కొండబాబు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా విన్నకోట శివప్రసాద్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారంతా జిల్లా పార్టీకి ఆయా విభాగాల అనుబంధ సంఘాలకు అధ్యక్షులుగా వ్యవహరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాకు..

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేఖ్ షఫీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎస్. శ్రీనివాసనావును నియమించారు.